## మంచి అలవాట్లే ప్రజారోగ్యానికి ఆయుధం




**నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :** స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, కలుషితం కాని ఆహారం, మంచి అలవాట్ల నిత్య ఆచరణే ప్రజారోగ్యానికి ఆయుధం అని డా.బి. రాజశ్రీ అన్నారు. మంగళవారం స్వచ్ఛంద ఆరోగ్య అవగాహన సంస్థ ఆరోగ్య చైతన్య వేదిక క్యాలెండర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఆరోగ్య చైతన్య వేదిక వ్యవస్థాపకులు, రాష్ట్ర కన్వీనర్ ఘన్ పూర్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారము, జీవనశైలి వ్యాధులతో పాటు మానవ మనుగడకు అవసరమైన వనరులు విద్యుత్తు, భూమి, నీరు, వాతావరణము, ఆడ శిశువుల సంరక్షణ కోసం కృషి చేయడం, డ్రగ్స్ నిర్మూలనపై స్వచ్ఛందంగా అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్చార్జిలు యాదమ్మ- బోధన్, వై శంకర్ -నిజామాబాద్ రూరల్, పీ ప్రవీణ్ రెడ్డి- నిజామాబాద్ అర్బన్, డి హెచ్ ఈ వేణుగోపాల్, హెచ్ ఈ ఓ లు నాగరాజు,సురేష్, రవి పాల్గొన్నారు.

### మిశ్రమ పంటలతో భూమికి అధికంగా

## సేంద్రీయ కర్బనం అందుతుంది

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



**నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :** జీలుగ, జనుము కంటే మిశ్రమ పంటలతో భూమికి అధికంగా బయోమాస్, నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రీయ కర్బనం అందుతుందని డా. రాజశేఖర్ అన్నారు. మంగళవారం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సభ్యులతో, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుస్థిర వ్యవసాయ కేంద్రం సభ్యుడు డా. రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి సీజన్ లో, పచ్చిరొట్ట విత్తనాల కోసం ఉత్తరాది రాష్ట్రాల మీద ఆధారపడుతూ, సమయానికి పచ్చిరొట్ట విత్తనాలు అందక, అధిక ధరలకు కొనాల్సి వస్తూ, రైతుల మీద, ప్రభుత్వం మీద ఆర్థిక భారం పడుతున్న ఈ పరిస్థితులలో, చైర్మన్ చొరవ తీసుకుని సమావేశం ఏర్పాటు చేశారు. జీలుగ, జనుముకి ప్రత్యామ్నాయంగా వివిధ మిశ్రమ పంటల విత్తనాలను తృణ ధాన్యాలు, పప్పుదినుసులు, నూనె గింజల పంటల విత్తనాలు పచ్చిరొట్ట విత్తనాలుగా వాడుకోవచ్చని తెలిపారు. చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ మిశ్రమ పంటల విత్తనాల ఫలితాలను ఇప్పటి వరకు వినియోగించిన మన రాష్ట్ర రైతుల నుండి, అధిక మొత్తంలో వినియోగిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతుల నుండి తెలుసుకోవాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పరిశోధన చేయించి, మన రాష్ట్ర రైతులకు ఉపయోగంగా ఉంటే, మిశ్రమ పంటల విత్తనాలను పచ్చిరొట్ట విత్తనాలుగా వినియోగించే విధంగా మనం కూడా ఆలోచించాలని సూచించారు.

## ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవో ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి



**నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఐడీవోసీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు టీఎన్జీవోస్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, టిఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ బల్బులు వితరణ



**రుద్రూర్, బతుకమ్మ :** రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ దయాల లక్ష్మణ్ గ్రామానికి సరిపడా విద్యుత్ బల్బులను సొంత ఖర్చులతో గ్రామ సర్పంచ్ కొండల్వాడి శంకర్, గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన ఊరి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించాలని సంకల్పంతో విద్యుత్ బల్బులను అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. బహుకరించిన విద్యుత్ బల్బులను గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు వీధి వీధి తిరుగుతూ కరెంట్ స్తంభాలకు అమర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండల్వాడీ శంకర్, వర్డ్ సభ్యులు తోట అనిత భాస్కర్, తోట నర్సిం లు, గాండ్ల ప్రవీణ్, గ్రామ పెద్దలు తోట సంగయ్య, నేరుగంటి బాలరాజు, తోట ప్రభాకర్, నడిపి సాయిలు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, తోట సుభాష్, సుదర్శన్ గౌడ్,గాండ్ల ఎర్ర సాయిలు, ఇల్టమ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం

### భీమ్ గల్ సీఐ సత్యనారాయణ




**భీమ్ గల్, బతుకమ్మ:** రోజు వారిగా వాహనాలు నడిపేవారు మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టారీత్యా నేరమని, పట్టుబడితే రూ. 10 వేల జరిమాన, జైలుకు వెళ్లాల్సి ఉంటుందని భీమ్ గల్ సీఐ సత్యనారాయణ అన్నారు. పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశానుసారం మంగళవారం మండలంలోని బడా భీమ్ గల్ లో రోడ్డు భద్రత కార్యక్రమం లో భాగంగా అరైవ్ ఆలైవ్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బైక్ నడిపేటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలన్నారు. హెల్మెంట్ వాడడం మూలన అది మిమ్మల్ని రక్షిస్తుందని తెలిపారు.సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, రాంగ్ రూట్లో వాహనాలు నడుపవద్దని సూచించారు. ముఖ్యంగా వాహనాలను మైనర్ పిల్లలకు ఇవ్వడం నేరమని, ఆలా ఇస్తే మైనర్ కుటుంబ సభ్యులపై కేసు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ డ్రైవింగ్ ప్రమాధాల బరిన పడకుండా వాహనాలను నడపడం గురించి సీఐ గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్సై తిరుపతి,ఉప సర్పంచ్ శంకర్ గౌడ్, ఏఎస్సై ఐ. సత్తార్, విల్లేజ్ సెక్రటరీ రజిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వరదకాలువకు నీళ్లు తెచ్చిన ఎమ్మెల్యేకు రైతుల కృతజ్ఞతలు



**వేల్పూర్, బతుకమ్మ:** కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా వరదకాలువకు నీటిని తెప్పించేందుకు కృషి చేసిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా వరద కాలువ వెంట గ్రామాల రైతులు వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి శాలువతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ రివర్స్ పంపింగ్ ద్వారా వచ్చిన నీటి వల్ల 2500 ఎకరాల పంటను ఎమ్మెల్యే కాపాడరని వారు కొనియాడారు. ఎమ్మెల్యే ను కల్సిన వారిలో కమ్మర్ పల్లి తిమ్మాపూర్, పాలెం, తొర్తి, మోర్తాడ్ గ్రామాల లబ్ది రైతులు ఉన్నారు.

## మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**ఇందల్వాయి, బతుకమ్మ :** ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన వివిధ శాఖల అధికారులు ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో సంక్రాంతి పండగను మండల ప్రజలు ఆయురారోగ్యాలతో,భోగి భోగ భాగ్యాలతో, సుఖ సంతోషాలతో సిరి సంపదలతో సిరిసంపదలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంతరావు,ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్




బట్,ఎస్సై సందీప్, తహసిల్దార్ వెంకట రావులు ఆకాంక్షించారు.గత సంవత్సరాన్ని వదిలి ఈ ఈ




సంవత్స రంలో నూతనొజ్జోత్సవంతో గడపాలని ఆకాంక్షించారు.

# భోగి పండుగ

చంటి పిల్లలకు తలంటుపోసి, బోగి పళ్ళు పోయడంతో దృష్టి పరిహారం చేసారు. కొత్త బట్టలు కట్టి, కుర్చీలో కూర్చుండచేసి, రేగు పళ్ళు, పైసలు, చెరుకు ముక్కలు, బోడికలు దిగువార బోస్తారు. ధనుర్మాసం నెల రోజులు ఆడపిల్లలు తయారు చేసిన గొబ్బి పిడకలు వేయడం, తెల్లవారగట్ల బోగిమంటలు వేయడం

చాంద్రమానం పాటించే తెలుగువారు సౌరమానం ప్రకారం జరిపే పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి సంబరాలలో మొదటిది బోగి పండగ. ఇది ఇతర పండుగల వలె తిథి ప్రధానమైనది కాదు. ఇది ధనుర్మాసానికి, దక్షిణాయనానికి ఆఖరు రోజు, మకర సంక్రమణానికి పూర్వపు రోజు. రైతులకు పంట పర్యాయాలు ముగిసి ఈపండుగ నాటికి ఇంటికి వచ్చేస్తాయి. వాళ్ళకు వ్యవసాయపు పనులు రద్దీ తగ్గి సుఖంగా కాలక్షేపం చేయడానికి వలసిన విశ్రాంతి లభించే కాలమిది.



చేతి కందిన పంటను అనుభవించడానికి తెచ్చుకుని భోగభాగ్యాలు అనుభవానికి రైతులకు వీలు కలిగించే పండుగ ఇది. కనుకనే "భోగి" అని పేరు వచ్చింది. గోదా దేవి తిరుప్పావై రచన పూర్తి చేసిన ముప్పయవ నాడు రంగనాధుడు ప్రత్య క్షమై, ఆమెను వివాహమాడ తానని, సకల భోగాలు సమకూరుస్తానని చెప్పి, వివాహ మాడగా, వివాహ తంతు పూర్తికాగానే ఆమె స్వామి వారిలో ఐక్యం పొందుతుంది. అందుకే భోగి అని ఈ పర్వదినానికి పేరు. జన సామాన్యానికి భోగ భాగ్యాలు ఇచ్చే రోజని ప్రతీతి. బోగినాడు మేఘాధిపతియైన ఇంద్రపూజ చేయడం అనవాయితీ. బోగినాడు బలి చక్రవర్తి అణగిన దినంగా చెపుతారు. సాంప్రదాయాచరణ ప్రకారం ఈనాడు బోగిపీడ నివారణకై తెల్లవారగానే అభ్యంగన స్నానం చేయడం విధాయక కృత్యం. భోగి నాడు భోగి పళ్ళు అనే పేరుతో రేగు పండ్లను పిల్లల మీద పోస్తారు. రేగు పండును బదరీఫలం రేగు చెట్టు, రేగు పండ్లు శ్రీ మన్నారాయణ ప్రతిరూపం. వాటిని తల మీద పోయడం వలన శ్రీ లక్ష్మీనారాయణుల అనుగ్రహం పిల్లలపై ఉంటుందని, భోగి పండ్లు పోయడం వలన పిల్లల మీద ఉన్న చెడు దృష్టి, దిష్టి తొలుగు తుందంటారు. తల పై భాగంలో ఉండే బ్రహ్మరంధ్రం పై భోగి పండ్లను పోస్తే పిల్లలు జ్ఞానవంతు లవుతారని విశ్వాసం. అలా ఆచరించారు. భోగి మంటలలో వాడే దేశి ఆవు పేడ పిడకలని కాల్చడం వలన గాలి శుద్ధి అవుతుంది. ఆ గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. సూక్ష్మక్రిములు నశిస్తాయి. ఇలా చేయడం వల్ల పిల్లలకు ఆయురారోగ్యాలు వృద్ధి కలుగుతాయని విశ్వాసం. నిజానికి భోగి మంటల్లో కాల్చాల్సింది పాత వస్తువులని కాదూ మనలోని పనికి రాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మనకున్న పీడ పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు చేకూరుతాయి. ఆడపిల్లలు తెల్లవారు జామున లేచి పెట్టే గొబ్బిళ్ళు, ఆర్ష కర్మలలో ప్రాముఖ్యం కలిగిన కళాభిజ్ఞత ఉట్టిపడే ముగ్గులు, పళ్ళ నైవేద్యాలు, బాజా భజంత్రీల వాద్యాలు ఎక్కడ చూసినా తెలుగుదనం ఉట్టిపడేట్టు చేసే పండగ ఇది.